## క్లుప్తంగా

### దిగబడిన ధాన్యం లారీ

- నిలిచిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల ఇక్కట్లు



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామ శివారులో పరికికుంట కల్వర్టు దగ్గర ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ గురువారం రాత్రి దిగబడింది. దీంతో ఆర్టీసీ బస్సు వెళ్లలేని పరిస్థితిలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని కొప్పుల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను గుడెప్పాడ్‌లోని మిల్లుకు తరలిస్తున్న క్రమంలో మైలారం గ్రామ శివారులో గల పరికుంట కల్వర్టు వద్ద లారీ దిగబడింది. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు వెళ్తున్న పెద్దాపూర్–వరంగల్ ఆర్టీసీ బస్సు లారీ దిగబడడంతో వెళ్లలేకపోయింది. దీంతో గంటపాటు ఆర్టీసీ బస్సు పోలేక బస్సులోని ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. పరకాల ఆర్టీసీ అధికారులకు డ్రైవర్ ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో రివర్స్ తీసుకుని రావాలని తెలుపడంతో సుమారు అరకిలో మీటర్ మేర రివర్స్‌లో వచ్చి శాయంపేట మీదుగా పరకాల వెళ్లారు. బస్సులో ఆరుగురు ప్రయాణికులు ఉండగా ఇద్దరు జోగంపల్లి గ్రామానికి చెందిన ప్రయాణికులు అక్కడే దిగి చీకటిలో నడుచుకుంటూ వెళ్లారు.

### 9నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

హసన్‌పర్తి: జూన్ 9 నుంచి 11వ తేదీ వరకు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు డబ్ల్యూడీబీఏ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి తెలిపారు. కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో బాలబాలికలతో పాటు పురుషులు, మహిళా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వచ్చేనెల 4వ తేదీలోపు http:// brtronline.in/ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94405 99888, 98480 27755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు దూరంగా బీఎంఎస్

హన్మకొండ: దేశ వ్యాప్తంగా ఈనెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు బీఎంఎస్, ఆ సంఘం అనుబంధ సంఘాలు దూరంగా ఉంటున్నాయని బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ తెలిపారు. దేశంలోని కొన్ని కార్మిక సంఘాలు కార్మిక నియమావళిని వ్యతిరేకిస్తూ సమ్మె నిర్వహించాలని నిర్ణయించాయని, అయితే, ఈ సమ్మెలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ పాల్గొనదని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కార్మిక వేతన కోడ్‌ను బీఎంఎస్ స్వాగతించిందని పేర్కొన్నారు.

### అనధికార క్వారీ నిర్వహణపై ఫిర్యాదు

కాజీపేట: ప్రభుత్వ అనుమతులు లేకుండా జనావాసాల మధ్య క్వారీ నిర్వహిస్తున్న వ్యాపారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ పి.ప్రావీణ్యకు వెస్ట్‌సిటీ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. గృహాలకు 50 మీటర్ల దూరంలో రాత్రి, పగలు తేడా లేకుండా క్వారీ పనులు చేపట్టడంతో వాతావరణం కలుషితంగా అవుతోందని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

### శివశక్తులకు ప్రశంసపత్రం అందజేత

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నానిగార్డెన్స్‌లో ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చౌదరి బిరుదాంకిత కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హాజరై నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శివసత్తులకు చౌదరి బిరుదాంకిత ప్రశంసపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ల సంఘం అధ్యక్షురాలు లైలా, కార్పొరేటర్ పల్లం పద్మ, శివసత్తులు, తదితరులు పాల్గొన్నారు.

### గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధి గుడిబండల్ ప్రాంతంలోని ఓ కిరాణం షాపులో రూ.1.67 లక్షల విలువగల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుడు బింగి రమేష్‌ను అదుపులోకి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్ రంజిత్ ఉన్నారు.

### కాశిబుగ్గలో మజ్జిగ పంపిణీ

వరంగల్ చౌరస్తా: వరంగల్ కాశిబుగ్గలోని లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో 42వ రోజు గురువారం చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వివేకానంద యోగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సుదర్శన ప్రారంభించారు.

# వనమహోత్సవానికి సిద్ధం

- టార్గెట్ 80 వేల మొక్కలు
- అందుబాటులో పలు రకాల మొక్కలు
- జూన్ మాసంలో నాటేందుకు ప్రణాళిక



శనిగరం నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

కమలాపూర్ : వనమహోత్సవానికి అంతా సిద్ధమైంది. ఈ ఏడాది రాష్ట ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మండల వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తం 80 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసి 1.20 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు.

**అందుబాటులో పలు రకాల మొక్కలు**

మండలంలోని 23 గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇళ్ల పరిసరాల్లో నాటేందుకు జామ, నిమ్మ, దానిమ్మ, అల్లనేరేడు, బొప్పాయి, సీతాఫలం, మునగ, మల్లె, గులాబీ, చామంతి, మందార, గోరింట, కనకాంబరం, వెలగ, కానుగ, అడవి తంగేడు, కరివేప, మారేడు, రావి, గన్నేరు, నాలుగు రకాల క్రోటాన్స్, అశ్వగంధ, రణపాల, గుల్‌మొహర్, టెకోమా, వేప, చింత వంటి పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అర ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్, ఐదెకరాల్లోపు మామిడి, టేకు, కొబ్బరి, బత్తాయి, ఈత, తాటి, మల్బరీ, ఆయిల్ పామ్ తోటల పెంపకానికి మూడేళ్ల పాటు నెలకు ఒక్కో మొక్కకు రూ.5 నుంచి రూ.15 వరకు, మునగ, యూకలిప్టస్ మొక్కల పెంపకానికి ఏడాది పాటు రూ.3 చొప్పున ఈజీఎస్ ద్వారా చెల్లిస్తారు.

**నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం..**

ప్రతీ ఏడాది నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలైతే నాటుతున్నారు. కానీ ఆ మొక్కలను విద్యుత్ తీగల కింద నాటడంతో ప్రస్తుతం మొక్కలు కాస్తా చెట్లుగా ఎదిగి విద్యుత్ తీగలకు తగులుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను, చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. అలా కాకుండా ఈసారి నాటే మొక్కలను భవిష్యత్‌లో నరికి వేసే పరిస్థితి రాకుండా ఉండేలా విద్యుత్ తీగల కింద కాకుండా దూరంగా నాటాలని వృక్ష, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

**జూన్‌లో ప్రారంభం..**

మండలంలోని నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఒకటి, రెండు వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్డుకిరువైపులా, చెరువు గట్లు, శిఖం భూముల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇళ్లల్లో పెంపకానికి అవసరమైన పలు రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వారు మొక్కల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. వనమహోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిస్తున్నారు.

### ఏర్పాట్లు చేస్తున్నాం



వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది చిన్న జీపీల్లో 3 వేలు, పెద్ద జీపీల్లో 5 వేలకు తగ్గకుండా మండల వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు అనుగుణంగా వర్షాలు ప్రారంభం కాగానే అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సారి విద్యుత్ తీగల కింద కాకుండా ప్రతి గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్లు ఏర్పాటు చేయాలని, నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి సంరక్షించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుంటున్నాం.

– గుండె బాబు, ఎంపీడీఓ

# డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కమలాపూర్ : ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం కొలుగూరి బాలరాజు అధ్యక్షతన జరిగిన సీపీఐ రెండో మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో సుమారు 3 వేల మంది నిరుపేదలను గుర్తించి వారి కోసం గత పదేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారని, వాటిని ఇప్పటి వరకు పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మండల కేంద్రానికి 90 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, అవి నిరుపేదలకు సరిపోవని, ప్రస్తుత ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

**మండల నూతన కార్యవర్గం**

సీపీఐ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నకీర్త ఓదెలు, సహాయ కార్యదర్శిగా గొల్లె మహేందర్, ఎండీ.షమీమ్, కోశాధికారిగా జక్కు రాజుగౌడ్, కార్యవర్గ సభ్యులుగా శనిగరపు వంశీ, శనిగరపు బాలు, మాసు ప్రసాద్, లక్ష్మి, జయప్రద, లచ్చయ్య, సంపత్, మహేశ్, రవి, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, భాస్కర్‌రావు, భాస్కర్, రవి, శిరీష, ఐలయ్య, భాస్కర్, నవాబ్ ఎన్నికయ్యారు.

# మత్స్యగిరి స్వామికి పుష్పయాగం



మహా పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నాగెల్లి వేడుకను అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశ్వక్సేన ఆరాధన స్వస్తి పుణ్యావసనాన్ని ద్వాదశ ఆరాధనలతో వివిధ రకాల పుష్పాలతో యాగాన్ని అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నికులు వీరవల్లి వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. మత్స్యగిరి స్వామి, శ్రీదేవి– భూదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి వేద పారాయణాలు చేసుకుంటూ దేవాలయం చుట్టూ 12 ప్రదక్షిణాలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. గ్రామ పెద్దలు ప్రతాప్‌సేనారెడ్డి, కృపాకర్‌రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, శివరామకృష్ణరెడ్డి, మనీష్‌రెడ్డి, కందగట్ల కోటేశ్వర్, సామల రవీందర్, కుసుమ శరత్, దిండిగాల వంశీ, కాంబత్తుల ప్రకాశ్, బాసాని వెంకటేశ్వర్లు, నామని శివ, భక్తులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ వైద్యసేవలు వినియోగించుకోవాలి

- డాక్టర్లు కిషన్‌రావు, తయార్ మసూద్



ల్యాదెళ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

దామెర : రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని ఆ సంస్థ డాక్టర్లు కిషన్‌రావు, మొహమ్మద్ తయార్ మసూద్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల రూరల్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా పరీక్షలు చేసుకుని వైద్యుల సలహాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్, గంగాధర్, జగదీశ్వర్, శ్రీకాంత్, నర్సింహాచారి, పోశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ఎల్కతుర్తి : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సైబర్ క్రైం నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పకూడదన్నారు. గ్రామాల్లో యువత గంజాయ్ మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పట్ల శ్రద్ధ వహించి చెడుమార్గంలో నడువకుండా సన్మార్గంలో నడిచే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ప్రజలతో మమేకమవుతూనే నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట సీఐ పులి రమేశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

# జీపీ కార్మికుల సమ్మె నోటీస్ అందజేత





సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

ఐనవోలు : సీఐటీయూ గ్రామపంచాయతీ కార్మికులు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందించారు. మండల కేంద్రలోని అంగడి సెంటర్‌లో సీఐటీయూ జీపీ కార్మికులు మండలస్థాయి సమావేశం గురువారం జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుని అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నోటీస్ అందజేసినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట యాకయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మెలో ప్రతీ జీపీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కు సాధన, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని ఈ సందర్భంగా జీపీ కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, బొట్ల సారంగపాణి, మండల అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి సురేందర్, కుమారస్వామి, శ్రీనివాస్, ఏసెబు, మల్లేష్, చంద్రయ్య, మల్లేష్, పూల, భాగ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

### రైలు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో హుజూరాబాద్–పరకాల మార్గంలో ఉన్న రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని ఓ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మధ్యప్రదేశ్‌కు చెందిన శివియాల్ మార్స్‌కోలె (30) అనే యువకుడు గురువారం తెల్లవారుజామున దుర్మరణం చెందాడు. కాజీపేట రైల్వే జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మార్స్‌కోలె వరంగల్ నుంచి నాగపూర్‌కు వెళ్తుండగా ఉప్పల్ రైల్వే స్టేషన్లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టుకోగా తల పగిలి ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. మృతుడి వద్ద వరంగల్ నుంచి నాగపూర్‌కు జనరల్ టికెట్‌తో పాటు మూడు ఫోన్ నంబర్లు ఉన్న చిట్టీ దొరికిందని, అందులో ఒక నంబర్‌కు ఫోన్ చేయగా మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన వాడని, మేస్త్రీ పని చేస్తాడని, స్వగృహానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక పాప ఉందని తెలిపినట్లు చెప్పారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

### లేబర్ కార్డుల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధిలోని రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాలనీ పార్కులో పలువురు భవన నిర్మాణ కార్మికులకు గురువారం లేబర్‌కార్డులు పంపిణీ చేశారు. లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఎన్‌టీయూసీ హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్, కార్మికరత్న యమడాల హనుకాంత్, షేక్ అజ్గర్ పాల్గొన్నారు.

# కబడ్డీ క్రీడోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న పొదుపు సంఘం నాయకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌లో ఈనెల 23, 24, 25 తేదీల్లో అంబేడ్కర్ పొదుపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కబడ్డీ క్రీడోత్సవాల కరపత్రాన్ని సంఘం సభ్యులు గురువారం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న కబడ్డీని బతికించాలన్న సంకల్పం ప్రతిఒక్కరికీ ఉండాలన్నారు. నేటి యువత డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్, మద్యానికి బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటూ ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రోజుల్లో యువతను క్రీడల వైపు మళ్లించి వారిలో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు, నాల్గో బహుమతిగా రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులకు, అతిథులకు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వారు తెలిపారు. జట్ల రిజిస్ట్రేషన్ కోసం 9640406694, 8106598307 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# గిట్టుబాటు కూలిపై అవగాహన కలిగి ఉండాలి

- ఏపీఓ శారద



పులుకుర్తిలో అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శారద

దామెర : ఉపాధిహామీ కూలీలు గిట్టుబాటు కూలిరేట్లపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని పులుకుర్తి రంగనాయకమ్మ చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 120 మంది కూలీలు హాజరుకావడంపై మేట్లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి కూలీ కొలత ప్రకారం రోజుకు రూ.307 పొందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని కూలీలకు సూచించారు. ఆమె వెంట ఈసీ రాజేశ్, సీనియర్ మేట్ లత, కారోబార్ ఆనందం, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



వేలేరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



ఎల్కతుర్తి : వేసవి శిక్షణ పత్రాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్, ఇండోర్‌గేమ్స్, డ్యాన్సు, కర్సీవ్ రైటింగ్, పాటలు పాడటంపై శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించారు. ముంగిపు సమావేశంలో తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎస్సై సురేశ్ బహుమతులు అందించారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని సూచించారు. శిబిరంలో నేర్చుకున్న నైపుణ్యాన్ని ప్రదర్శించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రమౌళి, హెచ్ఎం జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు కోటేశ్వర్ రావు, దయాకర్, డ్రాయింగ్ టీచర్ బాలయ్య, సంజీవ్, సీఆర్పీలు శ్రీనివాస్, వెంకటేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిబిరం నిర్వహణకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంఈఓ సునితారాణి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్పీ మాస్త్రో ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ధ్రువపత్రాలు అందించారు. విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాన్ని మరవకూడదన్నారు. చదువుపై దృష్టిసారించి ఉన్నతంగా రాణించాలని ఈ సందర్భంగా సూచించారు. సంస్థ కోర్‌టీం సభ్యులు హుస్సేన్ బాషా, వంశీ, సుష్మా, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, శ్రీనివాస్, సిసింద్రీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భూసారం పెంపుదలకు పచ్చిరొట్ట దోహదం



దామెర : పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు



వేలేరు : మాట్లాడుతున్న కమలాకర్



ధర్మసాగర్ : మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

దామెర : భూసారం పెంపుదలకు పచ్చిరొట్ట ఎరువులు దోహద పడుతాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.సతీశ్ చంద్ర అన్నారు. మండలంలోని పులుకుర్తి రైతువేదికలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువులు వేయడం లేదా భూమిలో కలియ దున్నడం వలన పంటకు కావల్సిన నత్రజని, ఇతర పోషకాలు లభిస్తాయని అన్నారు. భూ సారాన్ని పెంచి నేలతల్లిని రక్షించుకోవాలని రైతులకు సూచించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఖచ్చితంగా పంటమార్పిడి చేసుకోవాలని తద్వారా చీడ, పీడల ప్రభావాన్ని నివారించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. మట్టి నమూనాలను పరీక్షించుకొని అవసరం మేరకే ఎరువులు వాడాలని పేర్కొన్నారు. చీడ, పీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని అన్నారు. అనంతరం డాక్టర్ జి.పద్మజ మాట్లాడుతూ.. జీవనియంత్రణ శిలీంద్ర నాశనులైన ట్రైకోడర్మవిరిడి, సూడోమోనాస్ వంటివి వాడాలని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఏఓ రాకేశ్, ఏఈఓ రామకృష్ణ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రశాంత్, కుమారి, రీమ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : రైతులు పంట మార్పిడి విధానం పాటించాలని శాస్త్రవేత్తలు దిలీప్ కుమార్, విశ్వతేజ సూచించారు. తాటికాయల గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ విశ్వతేజ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ జయశ్రీ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పవన్, పూజితతో పాటు రైతులు పాల్గొన్నారు.

**వేలేరులో..**

వేలేరు : రైతులు వేసవిలో దుక్కులు కలియదున్నాలని వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు జె.కమలాకర్, ఎల్.సుహాసిని అన్నారు. మండలంలోని కమ్మరిపేట గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఓ కవిత, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి సుస్మిత, ఏఈఓ రాజశేఖర్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు కీర్తి, లక్ష్మీప్రసన్న, లోడీ సంస్థ ప్రతినిధి జోగు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామన్నపేట: వరంగల్ గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 – 21వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా ఒకచోట చేరి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గ్రూపు ఫొటోలు దిగారు.